# కోరిక తీరింది కాని....

కాపా లక్ష్మి

**ప్రేమించిన వ్యక్తి సాన్నిధ్యంలో మైమరపు కలగాలి, మధురానుభూతి కలగాలి, కళ్లకు ఒక విధమైన మత్తు ఆవరించాలి. ఆత్మీయత లేనిచోట ఆప్యాయతకు తావులేదు. వలపు, మధురిమ డిగ్రీలలో దొరకవు ... డిగ్రీలతో సుఖాలను కొలిచేవారికి, కోరికలు తీరినా, కామనలు తీరవు.**

"మంజూ!" హాల్లోంచి తండ్రి కేక వినిపించింది.

నిన్న సాయంత్రం స్నేహితురాలిచ్చివెళ్ళిన శుభలేఖ మరోసారి చూస్తోంది మంజుల. తండ్రి కేకవిని అది పుస్తకంలో పెట్టి మెట్ల దగ్గిరికి వచ్చింది. తండ్రి చేతిలో పేపరు కంటబడింది.

"రిజల్ట్సు వచ్చాయా! నాన్నా!" అంటూ వరుగున మెట్లు దిగింది. ఆమె గుండెలు గబగబా కొట్టుకుంటున్నాయి.

"నీవు పాసయ్యావమ్మా సెకండ్ క్లాసులో. ఇదిగో నీ నెంబరు." ఆయన సంతోషంగా అంటూ లోపల గదిలోకి వినబడేట్లు కేకవేశారు. "ఇదిగో! ఇలారా! మంచివార్త చెబుతాను." అన్నారు భార్య నుద్దేశించి.

ఇంకోసారైతే "ఏం నాన్నా! అమ్మను పేరుతో పిలవరాదూ! ఇదిగో, అదిగో అంటూ పిలుస్తావేం!" అని వుండేది మంజుల. ఇప్పుడు ఆదరాబాదరాగా స్నేహితురాండ్రలో ఎవరెవరు ప్యాసయ్యారా అని వెదుక్కుంటోంది.

తల్లి నవ్వు ముఖంతో లోపల్నించి వచ్చింది. పేపరు చూస్తూనే "ఆ మంచివార్త మీరేమీ పూరించి నాకు చెప్పక్కర్లా. నాకూ తెలిసిపోయిందిలెండి. అమ్మాయి ప్యాసయిందని కాబోలు ఆనందంతో ముఖం వెలిగిపోతోంది."

అమ్మా, నాన్నా విసురుకునే ఛలోక్తులు అలవాటే మంజులకు.

"'కాక! మరేమిటనుకున్నావ్! ఇంత ఆనందపడుతున్నందుకు మాకు కానుకేమిటమ్మా మంజూ!" తండ్రి సరదాగా ప్రశ్నించారు.

'మిమ్మల్ని ఆనందపెట్టినందుకు నాకేమి కానుకిస్తారు నాన్నగారూ!' అంత సరదాగాను అంది మంజుల.

"బాగుంది వరస. అన్నట్టు రవణ పాసయ్యాడో లేదో చూడవే!" అంది తల్లి.

"అరె. మరిచేపోయాను. పేపరిలా తే." గబగబా పేపరందుకొని వెతికారు. ఆయన కళ్లల్లో నిరాశ నిండింది.

"ఈసారీ బావ పరీక్ష పోయిందన్నమాట—" మంజు తేలిగ్గా అనేసింది. "ఇంక బావ పరీక్ష ప్యాసవలేదు నాన్నా!"

"బాగా తెలివైనవాడే. మరి వాడికేమి శనిపట్టిందో!" తల్లి నిట్టూర్చింది.

"తెలివేవుంటే ఎందుకు ప్యాసవరూ!" వ్యంగ్యంగా అంది మంజు, రవణ మీధ క్రొత్తగా ఏర్పడుతూన్న తక్కువ భావంతో.

ఆ మాటలకి తల్లి బాధ పడింది. "తొందరపడి అలా అనేయటం తప్పమ్మా!" అంది మంజువైపు చూస్తూ.

తండ్రి అందుకున్నారు. "కొందరు కొన్ని విషయాల్లో రాణించలేరు. అలాగని వాళ్లని అన్నిటా అసమర్థులని అనగలమా తల్లీ!"

విసుగ్గా మార్చుకుంది ముఖభంగిమను మంజుల. ఆ తర్వాత కాస్సేపు ఎవ్వరూ మాట్లాడలేదు.

నిజానికి రవణ తప్పినందుకు ఆమెకు అంతరాంతరాల్లో బాధ కలిగింది. కాని తనకు కలిగిన విజయం వల్ల మనసులో సంతోషం తరంగాలుగా లేస్తోంది. బావ ఇన్నేళ్ళుగా ప్యాసవలేని పరీక్ష తాను ప్యాసయింది. ఆమె హృదయంలోని ఒక చిలిపి చైతన్యం ఎంతో గర్వంగా తల ఎత్తుకొంది ఈ సంఘటనతో.

*  *  *

ఆ సాయంత్రం స్నేహితురాండ్రంతా వచ్చి పడ్డారు. సినిమా ప్రోగ్రాం వేసుకున్నారు. సినిమాకు వెళ్లేముందు కబుర్లు చెప్పుకున్నారు.

"ఇంకా చదువుతావా మంజూ!" ఆమెకి ముఖ్య స్నేహితురాలైన జగతి అడిగింది.

మంజు ఏమో చెప్పబోయేటంతలో "పెండ్లికొడుకు తయారుగా వున్నాడుగా! యింకేమి చదువుతుంది?" కొంటెగా అంది సరస్వతి.

మంజు ఏదో చెప్పబోయేంతలోనే రాజ్యం అడిగింది, "అన్నట్టు మీ బావ ప్యాసయ్యాడా మంజూ!" అని.

'ఊహుఁ' తల త్రిప్పింది మంజుల. ఎందుకో ఆమె మనస్సు చివుక్కుమంది.

"మంజుల ఏ యం. బి. బి. యస్. నో, ఏ పిహెచ్. డి. నో చేసుకుంటుంది కాని బి. ఏ. తప్పినవాణ్ణి చేసుకుంటుందా?" అనుమానం ప్రకటించింది విశాల.

"దాని తెలివికి తగ్గవాణ్ణే చేసుకుంటుంది. *మంజులకేం తక్కువనీ. . ." అంది రాజ్యం.*

మంజులలోని వానిటీని స్పృశించాయా మాటలు.

"చదువులో ఏముందే మీ పిచ్చిగాని. తప్పనిసరిగా కాబోయే భర్తకు ఇన్ని డిగ్రీలు ఉండాలని రూలేమన్నా ఉందా! భర్త మంచివాడవటమే భార్య అదృష్టం" అంది జగతి నెమ్మదిగా.

"అలాగేం! ఒట్టి కబుర్లు చెప్పకు. మరి 'ఫారన్' వెళ్లి పిహెచ్. డి. డిగ్రీ తెచ్చుకున్నవాణ్ణి చేసుకోబోతున్నావేం!" జగతిని వేళాకోళం చేసింది విశాల.

"చేసుకుంటే! ఎవరి అభిప్రాయం వాళ్ళు చెప్పకూడదా! మనస్తత్వాల్లో ఉండాలి కాని డిగ్రీల్లో ఏంలేదు." అంది జగతి స్థిరంగా.

"పోవే. అమ్మమ్మ కబుర్లు నువ్వూను. పదండి సినిమాకు టైమవుతోంది." అంటూ రాజ్యం అందరినీ బయల్దేరదీసింది.

సినిమా చూస్తున్నా అన్యమనస్కంగానే ఉంది మంజుల. ఆమె మనస్సు ఆమెకే స్పష్టంగా తెలియటం లేదు.

● ● ●

"రవణ వూళ్ళోలేడు కాబోలు నిన్ననంతా కనిపించలేదు." అమ్మ అంది భోజనాల సమయంలో.

"నిజమే. కనిపించలేదు. ఎక్కడికి వెళ్ళాడో." అనుకుంది మంజుల. అంతలో మళ్లీ అనుకుంది. "అయినా అమ్మకింత అభిమానం ఎందుకో రవణ బావ అంటే — నాన్నకూ అంతే."

బావ మాటల ధోరణి సరదాగా ఉంటుంది. ఆత్మీయతాభావం ఉంది తమ మధ్య.

భోజనాలయ్యాక మేడమీద గదిలో ఏదో పుస్తకం పట్టుకుని కూర్చుంది. స్నేహితురాండ్ర మాటలు గుర్తుకు వచ్చినయ్.

తాను బావను చేసుకుంటుంది అని అనుకుంటున్నారేమో అంతా!

తనకీ బావ అంటే అభిమానమే కాని ఆతడు ప్రతిసారీ తప్పుతూవుంటే ఆతడంటే గౌరవం తగ్గుతోంది.

అయినా మళ్లీ తప్పటమేమిటి? సరిగ్గా చదువుకోగూడదూ! అసలంత తెలివి తక్కువగా ఎలా ఉంటారో!

జగతి పెండ్లి అట. వరుడు డాక్టరేట్ డిగ్రీ పుచ్చుకున్నాడు. విదేశాలకూడా వెళ్ళివచ్చాడు.

అదృష్టవంతురాలు జగతి!

"మంజూ! హార్టీ కంగ్రాచ్యులేషన్స్."

*ఆలోచనలలో మునిగివున్న మంజుల ఉలిక్కిపడి* కళ్లు తెరిచింది. రవణ బావ!

"అదేమిటి మంజూ! జపం చేస్తున్నావ్!"



నవ్వుతూ లోపలికొచ్చాడు రవణ

ఎందుకో ఆ నవ్వు! పరీక్ష పోయిందనే బెంగ ఏ కోశానలేదు ఎలా నవ్వుతున్నాడో!

**ఆతని ముఖంలోకి చూస్తూ కూర్చుంది.**

"అందమైన స్వప్నం పాడుచేయలేదు కద! తీరిగ్గా కూర్చుని పగటికలలు కంటున్నావా" నవ్వుతున్నాడు కూడా

"ఏం తప్పా!"

"పగటికలలు మంచివేనట సైకాలజీ ప్రకారం పెద్ద పెద్ద రాజకీయవేత్తలు —తాము చేయబోయే ప్రణాళికలకు రూపం ఏర్పరుచుకొనేది పగటికలల్లోనేట" బావ చేతిలో ఏదో సైకాలజీ పుస్తకం ఉంది అదీ కథ

సైకాలజీ మీద, పగటికలలమీద ఉపన్యాసం వినే

ఓపిక యిప్పుడామెకు ఏ కోశానలేదు.

"ఈ పుస్తకాలన్నీ యింత ఓపిగ్గా చదువుతావే, క్లాసు పుస్తకాలు చదవబుద్ధికాదా బావా నీకు!"

రవణ ఎదురు చూడని ప్రశ్న వచ్చింది. మనసు చిన్నబుచ్చుకున్నాడేమోగాని పైకి తేలలేదు.

"ఎవరి పిచ్చి వాళ్ళకానందం. అంతే. ఇంతకూ భవిష్యత్ కార్యక్రమం ఏమిటి? ఏం చేయదలచు కుంటున్నావ్!" రవణ ముఖంలో ఆసక్తి కనిపించింది.

"ఏమీ అనుకోలేదింకా!" విసురుగా జడ ముందుకు లాక్కుంది. జడలో గులాబీ క్రిందపడింది.

ఆ భంగిమ రవణకు నయనానందకరమైనది కాబోలు ముగ్ధుడై చూచాడు.

ఆ చూపుకి తెల్లబోయి అడిగింది మంజుల "ఆదేమిటి బావా! క్రొత్తవాళ్ళని చూచినట్లు చూస్తున్నావ్!"

రవణ కళ్ళు తళతళలాడాయి. "క్రొత్త అందంతో కనిపిస్తున్నావ్ ఈ రోజు! కారణం ఏమిటో!" అన్నాడు ప్రేమ ధ్వనిస్తూన్న కంఠంతో.

ఒక్కక్షణం మంజుల మనస్సు ఆనందంతో ఎగిరి పడింది. అందాన్ని ప్రశంసిస్తే ఎవరు పులకించరు! అంతలోనే నిరాసక్తంగా ముఖం పెట్టి "నేను ఎప్పటి లాగానే ఉన్నాను బావా!" అంది.

రవణ చూస్తూ ఉన్నాడు.

మంజుల అర్థం కావటం లేదతనికి. ఏమైనా ఈ మధ్య మంజుల ప్రవర్తన వింతగా ఉంటోంది.

అంతలో నవ్వుతుంది నీ కోసమే అన్నట్లు. మరింతలోనే ముఖం ముడుస్తుంది నీవెవరివో అన్నట్లు.

ఆమె నవ్వు ముఖం అంతలోనే అతడికి ధైర్యాన్ని ఇచ్చింది.

"రాత్రి సినిమాకు వెడదాం! వస్తావా మంజూ!" అడిగాడు అనురక్తితో.

ఎన్నిసార్లో బావతో సినిమాకు వెళ్ళింది మంజుల నిస్సంకోచంగా. కాని యిప్పుడు ఆమెకు వెళ్ళాలనిపించ లేదు. తన స్నేహితులెవరైనా చూస్తే ఏడిపిస్తారేమో!

"నువ్వెళ్ళు బావా! నేను రానులే." ఎలాగో అనేసింది.

పరిస్థితిలో మార్పు తేబోవటానిక్కూడా సాహసం, చొరవా ఉండాలేమో!

రవణకు నిరాశ కలిగింది. కాస్సేపు అలాగే కూర్చున్నాడు.

మంజుల తనతో సినిమాకు రాకపోయినా, కాస్సేపు సరదాగా నవ్వుతూ మాట్లాడిఉంటే అతడు సంతోషించి ఉండేవాడు.

అతడు అలా కూర్చోటం చూస్తే మంజులకు జాలి కలిగింది. ఈ బావకు తనపై ఎంతో అనురాగం! ప్రేమ! కాని ఏం లాభం! బావపై తనకు అభిమానం ఉంది. ఆత్మీయత ఉంది. జాలిఉంది. కాని వైవాహిక జీవితానికి కావలసింది పరస్పర అనురాగం కాని జాలి కాదని తాను ఎక్కడో చదివింది. ఆ ప్రేమే లేకపోతే దాంపత్య జీవితం దెబ్బతింటుందని విన్నది.

ఏమేమో ఆలోచిస్తోంది మంజుల, తన అభిప్రాయాన్ని సమర్థించే విషయాల్ని గుర్తుకు తెచ్చుకుంటూ.

రవణ లేచి "వస్తా! మంజూ!" అంటూ వెళ్ళిపోయాడు.

తాను ఏదో పొరపాటు చేసిన అనుభూతి పొందింది మంజుల.

తల్లి లోపలికి వచ్చింది. "అదేమిటే, నీతో సినిమాకు వెళ్దామని వచ్చాడు రవణ. అలా వెళ్ళి పోతున్నాడేం!" అనుమానంగా అడిగింది.

"ఏమోనమ్మా!" ముభావంగా అంది.

"నీవు సరిగా మాట్లాడలేదా ఏమిటే! అసలే వాడిది సున్నితమైన మనస్సు."

"ఏమిటమ్మా నీవు ప్రతిదానికీను! చిన్నపిల్లవాడా ఏమిటి బావ!" విసుక్కుంది.

"బావతో సినిమాకు వెడితేనేం! పరాయివాడా ఏమన్నానా! ఏమిటో నీ మనస్తత్వం అర్థం కాకుండా పోతోంది." గొణుక్కుంది తల్లి.

* * *

జగతి పెళ్ళికి వెళ్ళింది మంజుల. వధూవరులిద్దరూ అందంగా, ఆకర్షణీయంగా కనిపించారు. వరుని స్నేహితులంతా పెద్ద పెద్ద హోదాల్లో వున్నవాళ్ళు. జగతి మంజులను, మిగిలిన స్నేహితురాండ్రనుభర్తకు పరిచయం చేసింది. ఆతడు సరదాగా మాట్లాడాడు వాళ్ళందరితో కొంచెంసేపు.

సెలవులు కాబట్టి ఏమీ తోచటంలేదు. ఒకరోజు తండ్రి అడిగాడు. "ఇంకా చదువుతావా ఆపేస్తావా అమ్మా? అమ్మ నీ పెళ్ళి చేయాలని రోజూ పోరుతోంది" అంటూ నవ్వారాయన.

మంజుల మాట్లాడలేదు.

**అనుభవం**

**వేదనాసారమే అనుభవం.**

—ఎ. హెల్ప్స్

"ఆలోచించుకొని చెప్పమ్మా! ఇలాంటి విషయాల్లో తొందరపాటు మంచిదికాదు."

రవణ బావను గురించి ఆలోచిస్తూంటే జగతి భర్త స్మృతిపథంలో మెరిశాడు. పోల్చి చూడాలని లేక పోయినా అనాలోచితంగా దృష్టి అటే పోతోంది.

'బి. ఏ తప్పినవాణ్ణి చేసుకుంటుందా మంజుల'

"దాని తెలివికి అది ఏ యం. బి. బి. ఎస్. నో, పిహెచ్. డి. నో చేసుకుంటుంది కాని."

చెవుల్లో రింగుమంటున్నాయి ఆ మాటలు.

యూనివర్శిటీలో చేరితే తను! ఈ పెళ్ళి బెడద కొన్నాళ్ళు తప్పుతుంది . . .

ట్రాన్సిస్టర్ చేత్తో పట్టుకుని డాబామీద తిరుగుతోంది మంజుల. వివిధభారతిలో కమ్మని పాటలు వస్తున్నాయి.

మంజుల మనస్సులో ఏవో అవ్యక్తాలోచనలు కదులుతున్నాయి. అర్థంకాని భావాలను వేటినో రేపుతున్నాయి. తాను వింటున్న పాటల స్వరాలు ఆమె మనస్సు ఆమెకే అర్థంకాని కావ్యంలా ఉంది.

రవణ బావ, నాన్న మాట్లాడుకుంటూ యింటివైపు వస్తున్నారు. నాన్న చెప్తున్న మాటలకు ఊం కొడుతున్నాడు రవణ.

మంజుల క్రిందికి దిగి వచ్చింది. తండ్రి బయట ఎవరితోనో మాట్లాడుతుంటే రవణ లోపలికి వచ్చాడు.

"ఏం చేస్తున్నావు మంజూ!" — రవణ నవ్వుతూ పలకరించాడు.

"ఏముంది? పాటవింటున్నా!" ముఖంలోకి నవ్వు తెచ్చుకుంది. "కూర్చో! నిలబడే వున్నావేం!"

"ఫర్వాలేదు. నేను నిలబడే వున్నానని తెలిసింది కదా!"

"అదేమిటి?" విస్తుబోయి చూసింది.

"ఇదా! ఇది వెన్‌డెట్టా! నవల!"

"అది కాదు బావా!" మంజుల చిన్నబుచ్చుకుంది.

"ఏది కాదు మంజూ!"

మంజుల మౌనంగా తన గదిలోకి దారి తీసింది. రవణ కూడా లోపలికి వచ్చి కూర్చున్నాడు. లోవాల్యూమ్‌లో లత పాట వస్తోంది.

రవణ అడిగాడు. "మంజూ! జీవితంలో నీ ఆశయా లేమిటో చెప్పు."

"ఏం బావా! అలా అడిగావు!"

"ఏంలేదు, ఊరికేనే, తెలుసుకుందామని."

"నాకు యం. యస్‌సి. చదవాలని ఉంది."

"ఆ తర్వాత."

"ఉద్యోగం చేస్తాను బావా!"

"ఆ తర్వాత!" మంజుల మనస్సు అర్థంకాక, ఆసక్తితో, కొంచెం వ్యథిత హృదయంతోనే అడిగాడు రవణ.

మంజుల ఏదో చెప్పబోతూఉండగా తల్లివచ్చి గుమ్మంలో నిల్చుంది.

"రవణా! మీరిద్దరూ ఎక్కడికైనా సినిమాకుగాని, షికారుకిగాని పోగూడదా! ఏం తోస్తుంది యింట్లో!"

రవణ మాట్లాడలేదు. మంజులవైపు చూశాడు. మంజుల గోడమీద ఫోటోవంక చూసింది.

"అదేమే!" తల్లి తెల్లబోయింది.

"వద్దు అత్తయ్యా! నాకు కొంచెం పనిఉంది. మంజులకీ వెళ్లాలని లేనట్లుంది."

"సరే! కాఫీ తెస్తానుండు." వాళ్ళ ప్రవర్తన అర్థం కాక తల్లి వెళ్ళిపోయింది.

"మంజూ!" రవణ పిలిచాడు.

ఆమె ప్రశ్నార్థకంగా చూచింది.

"ఇలా చూడు. సూటిగా నా కళ్ళల్లోకి చూచి చెప్పు. ఏం చెపుతావో అని గుండెల్లో భయంగానే ఉంది. అయినా ముసుగులో గుద్దులాట దేనికి? మనస్సులో ఏమేమో ఉంచుకొని బాధపడటం దేనికి? అప్రియమైనా నాకు నిజంకావాలి. మిథ్యలో బ్రతకటం కష్టం. చెప్పు. మంజూ! నీవు నన్ను సహించలేకపోతున్నావా! నామీద ప్రేమలేదా!" రవణ గొంతు స్థిరంగా ఉంచుకోటానికి ప్రయత్నించాడు.

మంజుల నిస్సహాయంగా చూసింది.

"జవాబు చెప్పు మంజూ! అవ్యక్తమైన నీ ప్రవర్తనలో నే నూహిస్తున్నది నిజం కాదని చెప్పు. నీ మనస్సు నాదో కాదో చెప్పు." రవణ కలలో మాట్లాడినట్లు మాట్లాడుతున్నాడు.

మంజులకీ పరిస్థితి కష్టంగా ఉంది. బావ బాధపడ్డాడేమో తన భావాలు చెప్తే! అతడంటే తనకు ప్రేమ లేదని ఎలా చెప్పాలి! అతడికి డిగ్రీలు లేవన్న కారణంగా తన మనస్సు మారిందన్న విషయం ఎలా చెప్పాలి! అది కారణమని తాను ఛస్తే చెప్పదు. చెప్పలేదు కూడాను.

అసలు ప్రేమంటే ఏమిటి?

## ఉచిత బహుమతి


### ఆకర్షణీయమైన 1969 కాలెండరు

రామతీర్థ బ్రాహ్మీ ఆయిల్ ఒక పెద్ద సైజు సీసా లేక రెండు చిన్న సైజు సీసాల ప్రతి కొనుబడికిని అందమైన, ఆకర్షణీయమైన 1969 వ సంవత్సరపు కాలెండరు ఉచిత బహుమతిగ ఇవ్వబడుచున్నది.

మీకు కావలసిన వాటిని మీ సమీపపు స్టోరులో కొనుక్కొని మా ఈ ఉచిత బహుమతిని పొందండి.

ప్రకటించినది :

శ్రీ రామతీర్థ యోగాశ్రమం, దాదర్, బొంబాయి-14.





ఆతని సన్నిధిలో తాను మైమరచిపోలేదు. మధురానుభూతి కలగటంలేదు. ఆత్మీయత ఉందేమో కాని ఆప్యాయత కలగటంలేదు. . . .ఆలోచిస్తోంది మంజుల.

"జవాబు చెప్పలేవా మంజూ!" రవణ బాధగా అడిగాడు.

మంజులకి కళ్ళు చెమ్మగిల్లాయి. ఉన్నమాట చెప్పేస్తే మంచిదేమో!

"బావా! నీవంటే ఇష్టమేకాని ప్రేమలేదు బావా! నన్ను క్షమించు." అనలేక అనలేక అనేసింది.

రవణ ముఖం ఒక్కసారిగా నల్లబడిపోయింది. అప్రియమైన ఆ మాట పిడుగుపాటులా తోచింది.

ముఖం వివర్ణమయింది. ఐదునిమిషాలు గడిచినై.

"ఇష్టంలేని పెళ్ళిళ్ళవల్ల జీవితంలో సుఖం ఏముంటుంది? నీ అభిప్రాయం చెప్పినందుకు సంతోషం. వస్తాను." నెమ్మదిగా వెళ్లిపోయాడు రవణ.

తెల్లబోయి నిల్చుంది మంజుల.

ఒక నిరాశ హృదయాన్ని అంత మండిస్తుందని గాని, ఒక భగ్నప్రేమ అంత హృదయవిదారకంగా ఉంటుందనిగాని ఆమెకు తెలియదు. అలాగే చూస్తూ నిలబడిపోయింది వెళ్లిపోతున్న రవణవైపు.

కాఫీ, టిఫిన్ తెచ్చింది తల్లి. "రవణ ఏడీ!"

"వెళ్లిపోయాడు." నిర్లిప్తంగా అంది మంజుల.

"నీవు ఉండమనలేదూ? ఏమిటో నీ ప్రవర్తన అసలు అర్థంకాకుండా పోతోంది రానురాను. "ఏమన్నావు రవణను?"

"నేను బావను పెళ్లి చేసుకోనమ్మా! అదే చెప్పాను." నిర్లక్ష్యంగా కుర్చీలో కూలబడింది మంజుల.

తల్లి నిర్ఘాంతపోయి నిలబడిపోయింది.

'ఏం! అమ్మా! నేను పొరపాటు చేశానని అనుకుంటు న్నావు కదూ! లేనిది నటించడం నాకు చేతకాదమ్మా!"

తల్లి నిట్టూర్చింది. "నీ మనస్సు అర్థంచేసుకోవ టమే నీకు చేతకావటం లేదమ్మా! ఇంకా రవణను ఏం అర్థంచేసుకోగలవు! నిజం తల్లీ! అంతటి ఉత్తము డెక్కడా ఉండడు. నిన్నెంతో అపురూపంగా చూసుకోగల ప్రేమ రవణది. ఆతన్ని నిరాకరిస్తూ నీ వొక మాణిక్యాన్ని కాలతన్నుకుంటున్నావు. తర్వాత పశ్చాత్తాప పడి లాభం ఉండదమ్మా!"

"అమ్మా! నాకు మరకతాలూ, మాణిక్యాలూ ఎందుకమ్మా! నచ్చిన మనిషి కావాలి. నాకన్నా ఎక్కువ చదివినవాడిని చేసుకుంటాను. బావ కనీసం ఒక్క డిగ్రీ అయినా తెచ్చుకోలేదు. ఎలా చేసుకోనే! అంతా నవ్వుతారు నాకేమిటో చిన్నతనంగా ఉంటుంది." మనస్సు విప్పి తల్లితో చెప్పింది మంజుల.

"ఇవి అల్పకారణాలు తల్లీ! ఏమైనా జీవితానికి సంబంధించిన విషయాల్లో తొందరపడకూడదమ్మా! వ్యక్తికి గుణమే ప్రధానం. నీవెప్పుడు తెలుసుకుంటావు యింక." అంటూ తల్లి భారంగా వెళ్లిపోయింది.

సాయంత్రం తండ్రి అడిగాడు: "ఇంకా చదువుతావా అమ్మా! ఆపేస్తావా! ఏదో ఒకటి చెప్పు మరి."

మంజుల అంది. "నేనింకా చదువుకుంటాను నాన్నా!"

ఆయన విస్మయంగా కూతుర్ని చూచి "నీ ఇష్టం తల్లీ! బాగా ఆలోచించుకొనిరా, ఏ నిర్ణయానికైనా."

అన్నాడు.

"అయితే రవణను చేసుకోవన్నమాటేనా!" తల్లి గట్టిగా అడిగింది. మంజు తండ్రివంక చూచింది.

"నీ యిష్టమే తల్లీ! కాని ఒక్కమాట! మనిషిలోని మంచితనాన్నీ, వ్యక్తిత్వాన్నీ కొలిచేవి డిగ్రీలుకాదు. ఈ కోణంలోంచి చూచి నీవేలా నిర్ణయించుకొన్నావరే."

"ఎం. ఎస్‌సి. కి అప్లై చేస్తాను నాన్నా!" అంది మంజుల.

* * *

ఎం. ఎస్‌సి. పరీక్షలు వ్రాసింది మంజుల. ఆ రెండు సంవత్సరాలు పూర్తిగా చదువులో పడిపోయింది. మరో విషయాన్ని గురించి ధ్యాసే లేకపోయింది.

ఆ సెలవుల్లోనే ఆమె పెండ్లి ప్రయత్నాలు జరిగాయి. రిజల్ట్సు వచ్చేముందే ఆమె వివాహం డాక్టర్ సుధాకర్‌తో వైభవంగా జరిగింది. రవణకూడ ఉత్సాహంగా చేశాడు పెండ్లి పనులన్నీ.

మంజుల ఫస్ట్‌క్లాసులో పాసయ్యింది. ఎం. డి. చదువుతున్న భర్త! స్నేహితురాండ్ర పొగడ్తలకు ఆమె ఉబ్బిపోయింది. మనస్సులో ఎంతో గర్వపడింది.

ఆ మరుసటి సంవత్సరమే ఆతడు స్వంత ప్రాక్టీస్ పెట్టుకున్నాడు. మంచి డాక్టరుగా పైకి వస్తున్నాడు.

రవణ ఆ రెండుసార్లూ పరీక్ష ప్యాసవలేదు. మళ్లీ ఆ జోలికి పోలేదాతడు. ఒకరిద్దరు స్నేహితులు భాగస్థులుగా మందులషాపు పెట్టాడు. అది బాగా వృద్ధిలోకి వస్తోంది.

తన హృదయంలేని ప్రియురాల్ని రవణ మరిచిపోయాడో లేదో తెలియదు. మరి రెండేళ్లకు రవణ ఆ వూరిలో సంపన్నుడైన రామస్వామిగారమ్మాయి నీరజను పెళ్లి చేసుకున్నాడు. మంజులకు ఆహ్వానం వచ్చింది. కాని అప్పుడామె మనస్థితి బాగాలేదు.

* * *

ఆహ్వానం చేత్తో పట్టుక్కూర్చుంది మంజుల. కళ్ళు అక్షరాలను చూస్తున్నాయి. మనస్సు గతంలోకి తొంగి చూస్తోంది.

తనంటే ఎంత ఆపేక్షగానో ఉండేవాడు బావ! ఎప్పుడూ సినిమాకు రమ్మనో, షికారు రమ్మనో, ఛలోక్తులతోనో సరదాగా గడిపేవాడు.

బావ మాటలు చిలిపిగా, సరదాగా ఉండేవి. ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ గడిపివేసే మనస్తత్వం బావది. జీవితం అంటే చక్కని ఆటలా, అందమైన పాటలా గడపగల భావుకుడు రవణ.

తను చాలా నిర్లక్ష్యంచేసిం దాతణ్ణి, కేవలం డిగ్రీ లేదని.

ఎంత వద్దనుకున్నా బావ, భర్త యిద్దరి మనస్తత్వాలూ పోల్చి చూచుకోబుద్ధి వేస్తున్నది. కాని యిప్పుడు ఆ ఆలోచనవల్ల ప్రయోజనం శూన్యం, మనస్సులో మరింత అసంతృప్తి తప్ప.

"ఏమిటది?" అప్పుడే వచ్చిన సుధాకర్ అడిగాడు.

మౌనంగా శుభలేఖ టేబిల్‌మీద ఉంచి కాఫీ తెస్తానంటూ వెళ్లింది మంజుల.

తిరిగి వచ్చేటప్పటికి ఆతడు సోఫాలో వెనక్కి జారగిలబడి ఏదో మెడికల్ జర్నల్ తిరగ వేస్తున్నాడు.

కాఫీ టీపాయ్‌మీద ఉంచి ఆతని ముఖంలోకి చూచిం దామె. "కాఫీ తీసుకోండి" అంది.

"ఇలా యివ్వు" అంటూ తీసికొని సిప్‌చేసి ఒక్క క్షణం ఆమెవంక తేరిపార చూసి "కాఫీయిలాతగలడిందే!" అన్నాడు విసుగ్గా.

"పంచదార ఎక్కువైందా?"

"తక్కువైంది. కషాయం నయం యింతకన్న. చేయాలని చేస్తే కదూ!" సుధాకర్ ఒక చురక అంటించాడు.

"చేయాలనికాక . . . వద్దని చేస్తానా?" ఆతని ధోరణి మంజులకి నచ్చదు.

"పైగా, ఎదురుచెప్పటం చేతనవును మరేం చేతకాకపోయినా . . . " ఆతడు విసుగ్గా లేచి జర్నల్ తీసుకొని పైకి పోయాడు.

సుధాకర్ యింట్లో ఉండే వేళలే స్వల్పం. అది ఇలా వ్యర్థంకావటం చూస్తే మంజులకి మతిపోతూంది. ఏడుపు వస్తూంది.

కన్నీరు కారుతూంది.

ఎందు కిలా అవుతూంది?

ఆతనికి చేతినిండా పని. తనకు ఆట్టే పనిలేదు. ఆతనికోసం కాచి, వేచి ఊహల్లో విసిగిఉన్న మనస్సుకి ఆతని ప్రవర్తన రంపపుకోత అవుతూంది.

ఒక విధంగా ఆతడు వాస్తవవాది. తాను ఊహాజీవి. ఇద్దరి మనస్తత్వాలకు పొత్తు కుదరటంలేదు.

సుధాకర్ ప్రవర్తన వింతగా ఉంటుంది. నవ్వుతూనైనా తన కెదురుచెప్పటం సహించడు. ఇక సంభాషణలో స్వారస్య మేముంటుంది?

ఒక సినిమాలేదు. ఒక షికారులేదు. ఆతడికి తీరదు.

ఒకరోజు పిక్నిక్‌కి వెడదామంది. సరేనన్న సుధాకర్ ఆ విషయం మరిచిపోయి సాయంత్రానికి వచ్చాడు యింటికి.

ఒకసారి సినిమాకు వెళ్లి వచ్చారు. యంత్రంలాగా ఆతన్ని అనుసరించింది. అంతే. సినిమా చూస్తూ భర్త చేతిమీద చేయి వేసింది. సుధాకర్ యిటు తిరిగి "సినిమా చూట్టంలేదా!" అని అడిగాడు. ఏం జవాబు చెబుతుంది? ఆమె ముఖం వాడిపోయింది.

సరదాగా మాట్లాడుతూ, నవ్వుతూ, త్రుళ్లుతూ ఎందుకుండడు సుధాకర్! ఆమె కిది ఒక పెద్ద సమస్య అయిపోతూంది. తమ జీవితాల్లోని యీ ఎండుదనం ఆమెకు శూలంలా ఉంది.

అస్తమానమూ సీరియస్‌గానే ఉంటాడాతడు. అదెలా సంభవమో మరి? ఆ జర్నల్స్ చూస్తూనో, కేసులు స్టడీచేస్తూనో, ఆలోచిస్తూనో ఉంటాడు.

ఆతని బుర్రకు బయట కనిపించే సుందర ప్రకృతి కాని, భార్య మంజుల ఊహాజగత్తులోని మనోహర దృశ్యాలుగాని పట్టవు.

అసలు మంజుల ఎందు కలా దిగాలుగా ఉంటూందో ఆతని కర్థంకాదు. అది ఆవిడ తత్త్వమేమో ననుకుంటాడు.

"ఏదైనా పని కల్పించుకోరాదూ! ఎప్పుడూ ఆలోచిస్తూ కూర్చుంటే బుర్ర పాడవుతుంది." సలహా యిచ్చా డోసారి.

ఆతని ముఖంవంక చూస్తూ ఊరుకుంది మంజుల.


ఏడ్వలేక, నవ్వలేక, భర్తను అర్థంచేసుకోలేక నలిగిపోతూంది మంజుల.

ఇదా తాను కోరిన, కలలుకన్న కాపురం! ఇదా డిగ్రీలున్న భర్తతో తా నూహించిన ప్రణయం! ఒక ఛలోక్తి

దేహపుష్టికి ఆరోగ్యానికి
పండిత-డి.గోపాలాచార్యులవారి
జీవామృతం
1898 నుండి ప్రసిద్ధి గాంచినది
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్)లిమిటెడ్
మదరాసు-17

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్‌సాతో
చికిత్సను పొందండి
-శస్త్రచికిత్స
అవసరములేదు!
DOL-327 TEL

మీకు సంతానం లేదా!




అమూల్యము, శక్తివంతమునైన మూలికల యోగము. ఆపరేషన్లు చేయించి, విరాశ చెందిన సోదరీమణులు సంతానవతులై యోగ్యతాపత్రము లిచ్చియున్నారు.
వెల: రు. 10/- పోస్టేజి ప్యాకింగ్ అదనం.
శ్రీ నాగార్జున మూలికా కుటీరం,
రైల్వేస్టేషను వద్ద, రామాలయం వీధి,
తెనాలి-2.

లేక, ఏ పులకరింతా ఎరుగని జీవితం జీవితమేనా?

తన ఒంటరి ఆలోచనలతో మతి పోతూంది మంజులకి.

భర్త ఒకరాత్రి పలకరిస్తే వెక్కివెక్కి ఏడ్చింది మంజుల. జాలిగా చూశాడు. వెళ్ళిపోయాడు. అంతే ఎదేమని అడగలేదు.

భార్య కన్నీళ్లకుకూడా విలువయివ్వని భర్త! భార్య మనస్సు గ్రహించలేని భర్త! ఆమె హృదయం చెదిరిపోయింది.

ఛ! యీ కన్నీళ్లకి అర్థంలేదు. వ్యర్థమైన తన ఆలోచనలకి అవి చిహ్నాలు.

పేలవంగా నవ్వుకుంది మంజుల.

చలాకీగా, సెలయేటి గలగలలా ఉండే మంజుల గంభీరంగా, ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ మందకొడిగ తయారైంది. సుధాకర్ ప్రాక్టీస్‌మాత్రం విపరీతంగ పెరుగుతూంది.

డబ్బుతో ఆనందాన్ని కొనితెచ్చుకోగల శక్తి చాలా ఎక్కువమందికే ఉంటుందేమో! . . . అది మంజులకి తెలియదు.

ఎప్పుడైనా యిద్దరూ కాస్త మాట్లాడుకొని, నవ్వుకున్న రోజు మంజులకి పండుగ. అంతలో వచ్చేస్తారు యమదూతల్లా పేషెంట్లు. నిజంగ వాళ్ళు మంజుల దృష్టిలో యమదూతలే.

జీవితం మోయలేని బరువుగా ఉంది.

ప్రశాంత ప్రభాతాలూ, చల్లని సాయంసమయాలూ బరువుగా, విరాసక్తంగా గడుస్తున్నాయి.

టేబిల్‌మీద రవణ పెళ్లి శుభలేఖ పడిఉంది. మనస్సు వాతావరణంలో మార్పును ఆశిస్తూంది.

బూట్స్ చప్పుడు చేసుకుంటూ క్రిందికి దిగాడు సుధాకర్. "వెళ్తున్నా!"

"నేను ఊరికి వెళ్తున్నాను." త్వరగా అనేసింది.

"ఎప్పుడు! మళ్లీ ఎప్పుడు వస్తావు?" వాచీ చూసుకుంటూ అడిగాడు సుధాకర్.

అంటే వెళ్లమనేగా అర్థం! ఆమె అహం దెబ్బ తిన్నది.

"మీరూ రండి. రవణబావ పెళ్లి కాగానే వచ్చేద్దాం" అంది నెమ్మదిగా.

ఏ కళనున్నాడో సుధాకర్ ఆమెదగ్గరగా వచ్చి "ఇప్పుడు నాకు వీలు అవదు. నీవు వెళ్ళి పెళ్లి అవగానే వచ్చేయి. వీలయితే పెళ్లికి వస్తాలే!" అన్నాడు.

భర్తతో కలిసి వెళ్లాలన్న తన కోరిక సాధారణంగా తీరదు. ఒంటరిప్రయాణమే తనకు!

"సరే! సాయంత్రం వెళ్తాను."

సుధాకర్ వెళ్లిపోయాడు. అలా చూస్తూ నిలబడింది మంజుల.

ఎప్పుడూ అనుకుంటుంది, అలా వెళ్తూ వెళ్తూ వెనక్కి తిరిగి చిన్న చిరునవ్వు చిందిస్తారేమోనని. ఊహు.

ఒకవేళ తాను యీ నిరాశను ఊహల్లో రెట్టింపు చేసుకుంటూందా? ఏమో!

* * *

అప్పుడే బండి దిగి ఇంట్లో అడుగుపెట్టిన కూతుర్ని ఆనందంగా పలకరించారు తల్లీ, తండ్రీనూ.

"అదేం మంజూ, అల్లుడుగారు రాలేదేం!" ఇద్దరూ ఒక్కసారే అడిగారు. ఎలాగైనా అమ్మా, నాన్నా ఆలోచనలు ఒకటి. వారిది అనుకూల దాంపత్యం.

మంజు బలవంతంగా నవ్వు తెచ్చుకొని అన్నది.

"తీరిక లేదటమ్మా! సరిగ్గా పెళ్లి సమయానికి వస్తే వస్తానన్నారు."

"తీరిక లేకపోవటం ఏమిటమ్మా? ఇలాంటి సమయాల్లోకాకుంటే మరెప్పుడు నలుగురూ కలుసుకునేది!" తల్లి నొచ్చుకుంది.

మంజుల జవాబు చెప్పకుండా లోపలికి వెళ్ళిపోయింది.

తల్లితో తన కాపురం విషయం ఎన్నడూ చెప్పలేదు మంజుల. ఏమని చెప్పాలిగనుక. "నీవు ఒక మాణిక్యాన్ని కాలదన్నుకుంటున్నావమ్మా" అని తల్లి హెచ్చరించినప్పుడు, "నాకు మాణిక్యం ఎందుకమ్మా! నచ్చిన మనిషి కావాలి" అన్న దానాడు. ఇప్పుడు డిగ్రీలున్న సుధాకర్ మనస్తత్వం యిదీ అని తల్లితో చెప్పుకోటానికి ఆమెకు అభిమానం అడ్డుపడింది.

అయినా మంజుల ముఖంలోకి తల్లి అసంతృప్తిగా చూస్తూనేఉంది. కూతు రేదో దాస్తూందని ఆమెకు అనుమానమే.

రవణ మంజులను చూచి సంతోషం ప్రకటించాడు. "సుధాకర్ అన్నగారు రాలేదా!"అని అడిగాడు ఆప్యాయంగా.

"తీరిక లేదట. వీలుంటే వస్తానన్నారు" అని జవాబుచెప్పింది.

పెండ్లిపీటలమీద రవణా, నీరజా కూర్చున్నారు. రవణ పెళ్లిబట్టల్లో క్రొత్తఅందాలతో వెలిగిపోయాడు. నీరజ చాలా అందంగా ఉంది. రవణకు తగ్గ అమ్మాయి.

> **విరోధులు**
>
> **మీ శత్రువుల్ని పరికించి చూడండి — మీ తప్పులను ముందుగా ఎంచేవాళ్లు వాళ్లే!**
>
> —అంటిసినిస

పెళ్లి వైభవంగా జరిగిపోయింది. సుధాకర్ మాత్రం రాలేదు. వస్తాడని మంజుల అనుకోనేలేదు.

'ప్రతి చిన్న విషయానికీ బాధ పడటం మానెయ్యాలి. ఈ నా బలహీనతను జయించాలి' అనుకుంది మంజుల.

రవణ పెళ్లి జరిగి నాల్గురోజులైంది. ఆ మధ్యాహ్నం పడుకుని పగటికలలు కంటున్న మంజులకి పోస్ట్‌మాన్ కవరొకటి తెచ్చి యిచ్చాడు. ఆత్రంగా చూసింది. సుధాకర్ దస్తూరీ అది.

కవరు బరువుగా ఉండేసరికి మంజుల ఆశ్చర్యపోయింది. పెళ్లయిన క్రొత్తలోనే పొడిపొడిగా రెండు మూడు ముక్కలు క్షేమసమాచారాలుమాత్రమే వ్రాసిన సుధాకర్, యింత పెద్ద ఉత్తరం వ్రాశాడంటే తప్పక ఏదో విశేషం ఉండిఉంటుంది.

ఆదుర్దాగా కవరు విప్పింది. దానిలో చిన్న లేఖ. అది సుధాకర్ వ్రాశాడు.

"డియర్ మంజూ!

నీవు రిసెర్చికి అప్లై చేసినావా? నిన్న నీకు రిసెర్చిలో ఎడ్మిషన్, స్కాలర్‌షిప్పూ వచ్చినట్లు జాబు వచ్చింది. అది ఈ ఉత్తరంతో జతపరచి పంపుచున్నాను. ఉన్న ఊళ్లోనే కాబట్టి నీవు రిసెర్చిలో చేరటం నాకూ ఇష్టమే. నీకూ కాలక్షేపంగా ఉంటుంది.

ఎప్పుడు బయలుదేరి వచ్చేదవో జవాబు వ్రాయి.

పి. ఎస్. పెళ్లికి రాలేకపోయాను.

నీ

సుధాకర్."

ఒక్క నిట్టూర్పు విడిచింది మంజుల. అదే పరాయివాళ్ల ఉత్తరమైతే ఫక్కున నవ్వి, పదిమందితో కలిసి అల్లరి చేసిఉండేది. సుధాకర్ జాబులు గ్రాంథిక ధోరణిలో నడుస్తాయి. ముఖాముఖి సంభాషణల్లా మనోరంజకంగా ఉండవు. కేవలం 'బిజినెస్ టైప్.'

ఉత్తరం చేతిలోనే ఉంది. బయట అడుగుల చప్పుడయింది.

రవణా, నీరజా వచ్చారు.

ఆ సాయంకాలం ముగ్గురూ డాబామీద కూర్చున్నారు.

రవణ సరదాగా ఏవేవో కబుర్లు చెబుతున్నాడు. నీరజ రవణవంకే చూస్తూంది. ఆ కళ్లల్లో ఒక విధమైన మత్తు ఉంది. మెరుపు ఉంది. రవణ అంటే ఆమె కెంత అనురాగమో మంజుల గ్రహించగలిగింది. రవణ అదృష్టవంతుడు.

నీరజ ఎక్కువ చదువుకోలేదు. స్కూల్‌ఫైనల్ ప్యాసయింది.

'కాని ఎక్కువ డిగ్రీలున్న తమ జంటకన్నా ఈ జంట జీవితాన్ని అనుభవించగలరు; ఆహ్వానించగలరు' అనుకుంది మంజుల.

చెట్లచాటున సూర్యు డస్తమిస్తున్నాడు. పసిడి కాంతులు అంతటా పరచుకున్నాయి.

"ఏమిటి, మంజూ, ఆలోచిస్తున్నావు?" రవణ అడుగుతున్నాడు.

"దూరపుకొండలు నునుపనుకొన్న నా అజ్ఞానాన్ని గురించి" అనుకుందికాని పైకి అనలేదు.

"చీకటి పడుతూంది. క్రిందికి వెళ్దామా!" అ.. మాత్రం అంది.

మెట్లు దిగుతూ కనుకొలకుల్లో దాగిన బాష్పకణాల్ని కొంగుతో అద్దుకుంది మంజుల. తనలో తాను ఇలా అనుకుంది:

'అవును. నేను కోరిందేమిటి? వ్యక్తినికాదు, వ్యక్తికున్న చదువును, డిగ్రీలను. నా కోరిక తీరింది. కాని . . . తృప్తిమాత్రం దూరతీరాల్లోనే ఉండిపోయింది. వ్యక్తికి గుణం ప్రధానం. దాంపత్యానికి స్నేహం ప్రధానం అంటారు కదా! స్నేహం అంటే ఇద్దరిమధ్య కొన్ని విషయాల్లోనైనా ఐక్యత కుదరాలి కదా! మరి మాకో. . .' ఆమె ఆలోచనలు మార్చుకుంది. 'సుధాకర్ ప్రవర్తన గురించి నా అసంతృప్తి ఆలోచించినకొద్దీ పెరుగుతూంది. అమ్మో! నే నది భరించలేను. జీవితం చేజేతులా జారిపోతూంటే చూస్తూ ఊరుకోను. సుధాకర్ సలహాప్రకారం ఒక వ్యాపకం కల్పించుకుంటాను. రిసెర్చిలో చేరుతాను. ఏమైనాసరే నాకు విరుద్ధమైన మనస్తత్వంలో రాజీపడతాను.'

నీరజా, రవణా ఆమెవద్ద వీడ్కోలుతీసుకొని జంటగా వెళ్లిపోయారు. వాళ్లు వెళ్తూంటే చూస్తూ నిలబడింది మంజుల.

ఆమె మనస్సులో చేసుకున్న నిశ్చయంవల్లకాబోలు ఆమె కన్నులు ఏదో ఆశాభావంతో తళతళలాడుతున్నాయి. ★